


(గత సంచిక తరువాయి)

**చాట్ లకి ఒక గమ్యం లేదు**. ఫలితమూ లేదు. భారతికి కూడా విసుగు వచ్చింది. అప్పటినుండీ యూట్యూబ్ లో వచ్చే వీడియోలు ఒక భర్త భార్యని ఎంత ప్రేమిస్తాడు? అటువంటివి పెట్టేది. పూర్వ విద్యార్థుల సమ్మేళనం లో అతనికి మధు పట్ల ప్రేమ, స్నేహం, గౌరవం గురించి అందరూ చాలా చెప్పారు. చివరికి హాస్యంగా ‘ ఒరేయ్! జయదేవుడి భార్యపేరు పద్మావతి. అతనికి ఆమె పట్లగల ప్రేమని చూసి అతనికి పద్మావతీ చరణ చారణ చక్రవర్తి అని బిరుదు ఇచ్చారట. నీకీ రోజు మధుబాలా చరణ చరణ చారణ చక్రవర్తి అని బిరుదు ప్రదానం చేస్తున్నాం అని ముక్తాయించారు.

అందువల్ల ఆమె యూట్యూబ్ అని ఆశ్రయించింది. అటువంటి యూట్యూబ్ షేర్స్ పది పదిహేను అందుకున్నాక కానీ కృష్ణకి అర్థం కాలేదు. ముద్దు ప్రసక్తితో మొదలు పెట్టిన వాళ్ళ శృంగారసంభాషణ ఎందుకు ముందుకు సాగటం లేదో.

అప్పుడు మొదలయింది అతని సంభాషణల్లో మధు బాడీషేమింగ్, ఆమె క్యారెక్టర్ అస్సాషినేషన్. ‘ఇవాళ మా స్నేహితులు పెళ్ళికి పిలవాలని వచ్చారు. నా భార్యని చూసి ఏమిటండీ ఇంత ముసలిగా అయిపోయారు? డాక్టర్ గారు చూడండి.కుర్రాడిలా ఎంత ఆరోగ్యంగా, ఎంత హుషారుగా ఉన్నారో? అన్నారు. ఇక నా భార్య వీరంగం చూడాలి. ఓహ్! అందుకేనా నన్నూ బయటకు తీసుకు వెళ్లవు? అని రోజంతా సాధించింది. అని రాశాడు. దీనిలో నిజం ఏమిటంటే వాళ్ళు మేడం! మీ ఒంట్లో బాగాలేదా? అని అడిగారు. ఆరోజు ఆమెకు జ్వరం. అతన్ని డాక్టరుగారు బావున్నారు అన్నమాట నిజం. మామూలుగానే అతను అందమైనవాడు. గుండెనెప్పి తర్వాత మధు అతన్ని ఎక్సర్ సైజ్ లో, యోగా లో పెట్టింది, నడక ఉండాలని ట్రెడ్ మిల్ కొనిపించింది. ఆయోగ టీచర్ తో ప్రాణాయామ నేర్పించింది. అతని ఆహారనియమాలన్నీ వేయికళ్ళతో పర్యవేక్షిస్తుంది. అతనితో పార్టీలకు మొదట తన అలవాట్లు బయట పడతాయని ఆమె ఎంత అడిగినా అతను తీసుకు వెళ్ళలేదు. అభిమానవంతురాలయిన మధు అతనితో, పిల్లలతో బయటకు వెళ్ళేది కానీ పార్టీలకు వెళ్ళేది కాదు. ఈ రెంటినీ కలిపి అతను వేరే కథ చెప్పాడు.

అలాగే ఒకసారి ఇద్దరూ కలిసి గుడికి వెళ్లారు. తెల్ల జుట్టుని చిన్న ముడిగా వేసుకుని, రవ్వల దిద్దులతో, పట్టుచీరెలో ఉన్న మధుని పూజారి మీ భార్యా అంటే ఏం తంటానో అని అక్కాగారా అండీ అని అడిగారు. ఈ విషయం కూడా భారతికి చాట్ పెట్టి ' ఆమె ముసలిగా, అందహీనంగా కనిపిస్తే నా తప్పా? నేను అందగాడినని అందరూ చెపుతారు. నేనెప్పుడూ అ పొగడ్తలని పట్టించుకోలేదు (ఇది నిజమే.) ఇప్పుడు నువ్వు నాతో చాట్ చెయ్యటం మొదలు పెట్టాక, నీ అందం చూసాక నేనూ నీతో పోటీ పడాలని నిర్ణయించుకున్నాను. దాని ఫలితం ఇంకో చాట్.

'హాయ్ బ్యూటిఫుల్! దురదృష్టం ఏమిటంటే నువ్వు అందగత్తెవని నేనంటే నువ్వు ఒప్పుకోవు.నువ్వు ఎలిగంట్ గా ఉండటమేకాదు. నీకు 70 ఏళ్లంటే ఎవ్వరూ నమ్మరు తెలుసా! నలభై ఏళ్లంటే నమ్మొచ్చు. గొప్పగా ఉన్నావులే. నిన్ను ఇలా చూస్తూ ఉంటే నాకు కూడా నలభై ఏళ్ళకుర్రాడిలా కనిపించాలని ఆశగా ఉంది. నీ పక్కన నేను నడుస్తూ ఉంటే చూసే వాళ్ళు ఈ అందగత్తె ఎంపిక ఏమిట్రా ఇలా తగలడింది అనుకోకూడదు కదా! బయటవాళ్లకి ఎలా కనిపిస్తానో నాకు అనవసరం అనుకో, నీ కంటికి హ్యాండ్సమ్ గా కనిపించాలి. నీ అభిప్రాయమే నాకు ముఖ్యం.నీకు చాలా సార్లు చెప్పాను ఐ లవ్ యు. నీకోసం నేను అందంగా, ఆరోగ్యంగా ఉండాలి. నీ జుట్టుని పార్లర్ లో ట్రిమ్ చేయించుకున్నావు కదా! ఇంతకు ముందు కూడా చాలా ఆకర్షణీయంగానే ఉన్నావు. కానీ ఇప్పుడు మరీ మరీ ఎలిగంట్ గా, వైబ్రేంట్ గా ఉన్నావ్. కీప్ ఇట్ అప్."

"చాల్లే! నీతో నడిస్తే నీ భార్యని మీ అక్కా అని అడిగారు. నన్నూ మీ అమ్మా అని అడుగుతారు."

" ఏం మాట్లాడుతున్నావ్? నువ్వూ, నేనూ పక్క పక్కన నడుస్తుంటే మేడ్ ఫర్ ఈచ్ అదర్. చూడ చక్కటి జంట అంటారు. "

తర్వాత మొదలయ్యింది మధు వ్యక్తిత్వంమీద దెబ్బ. ఇది కొంతవరకూ నిజమే! భోజనం విషయంలో, మందు తన వెనుక తాగుతున్నాడేమో అనే అనుమానంతో, అతను వ్యాయామం మానేస్తే ఆమె చాలా కఠినంగా మాట్లాడేది. ఆమె అతను తన అలవాట్లతో తనని ఒక నిరంతర భయంలోకి తోసేసాడని చాలా నిరాశతో, దుఃఖంతో, కోపంగా ఉండేది. అతను గుండెజబ్బు అతన్నేమి మార్చలేదు. మళ్ళీ అటాక్ వస్తుందనే భయంతో అలవాట్లు మానేసాడు. నిజమే. కానీ అతని స్నేహబృందం, పార్టీలు ఏవీ మారలేదు.పైనుంచి ఒళ్ళుపై తెలీకుండా సెల్ ఫోను, వాట్సాప్. బావ నాకోసం మందు మానలేదు. తన ఆరోగ్యం కోసం భయపడి మానేశాడు. ఈ ఆలోచన వచ్చాక ఆమె మనసు బండబారి పోయింది. ధూమపానం, మద్యపానం మానలేదని పెదవులపై ముద్దు నిషేధించిన మధు ఇప్పుడు అతని ఆరోగ్యరీత్యా కొంత, వేదనతో కొంత అతన్ని శారీరకంగా దూరం పెట్టింది. కృష్ణ ఆమె ఉదాసీనతను భారతిని చేరుకోవటానికి సోపానంగా చేసుకున్నాడు.

ఐ లవ్ యు అనే మాటని ఇద్దరూ మంచినీళ్ళకంటే ఉదారంగా వాడారు. అతను క్లినిక్ లో కూర్చుని ఏం మాట్లాడాడో తెలీదు. కానీ చాట్ లలో మాత్రం ప్రతిరోజూ మధు మీద ఫిర్యాదులే. ఆమె టిఫిన్ తినమన్నా, నిద్ర లేవమన్నా

దానికి పెడర్థాలు తీస్తూ రాసేవాడు. అతనికి తెలుసు మధు ఏ ఉద్దేశంతో అన్నదో, కానీ భారతిని సంతోష పెట్టాలంటే మధుని తిట్టాలి. చివరికి అతనితో తన స్టైల్ని, అందాన్ని పొగిడించుకోవాలని, అతను తన భార్యని ప్రేమిస్తున్నాడని అంతా అనుకుంటుంటే అతను రోజుకి పదిసార్లు తనని ప్రేమిస్తున్నానని చెప్పాలని ఆశిస్తున్న భారతికి కూడా ఈ తిట్ల ప్రహసనం బోర్ కొట్టింది.

‘ సర్లే! నీకూ, నీభార్యకు ఉన్న గొడవలు నువ్వు రోజూ చెపుతున్నావ్. నేను రోజూ వింటూనే ఉన్నా అన్నది.‘ఏంటో ఎమోషనల్ గా ఇంత కనెక్ట్ అయిపోయాను.నిన్నూ ఎందుకంత ప్రేమిస్తున్నానో నాకే తెలియటం లేదు’ అంది ఒకరోజు.

ఈ వ్యవహారం ఇలా సాగుతుండగా ఈ మనిషి ప్రేమలు, ముద్దులు వరకూ వచ్చింది కదా అని కృష్ణ హద్దు మీరి ఒక మెసేజ్ పెట్టాడు.

“ 50 ఏళ్ళు దాటాక మగవాడికి శృంగారపరమైన కోరికలుండవు. వాడికి అటువంటి ఆలోచనలు రావు అనుకునేవాడిని. దురదృష్టం ఏమిటంటే నాకు ఆ రెండు ఉన్నాయ్. నా ఆల్కహాల్ వంకతో, నాకు గుండె జబ్బు అనే మిషతో చాలా సంవత్సరాలుగా నా భార్య నన్ను తాకనివ్వలేదు. అందువల్ల అవసరం అయితే నేను ఎంతవరకూ పెరఫార్మ్ చేయగలనో తెలీలేదు.“

అప్పటివరకూ ‘నా ముక్కుపుడక నా మొగుడి ముద్దుకి అడ్డం అనేవారు.’ ‘నువ్వు ఎంత అందమైనవాడివో తెలుసా? ’ ‘ నీ అందానికి, నీ పొజిషన్ బంగారానికి తావి అబ్బినట్టే.’ అందరిలానే నేను నీ అందాన్ని, పొజిషన్ చూసాను. నీ భార్య అనబడే ఆ దురదృష్టవంతురాలు కొంతకాలమైనా నీ శృంగారాన్ని చవి చూసింది అని ఈర్ష్య.‘ అంటూ కొన్ని పదుల చాట్ పెట్టిన భారతి అతని ఈ చాట్ కి మాత్రం చాలా వైల్డ్ గా స్పందించి మౌనం వహించింది. చాట్ లు ఆపేసింది. అతని ఫోన్లు ఎత్తడం మానేసింది. షరా మామూలే. ఇతని దేవిరింపు, బ్రతిలాడటం. ‘నువ్వే నా ప్రాణ వాయువు. నేను బ్రతికి ఉన్నది నీ చాట్ లవ్ కోసమే.నాభార్య తన ప్రవర్తనతో నా జీవితంలోని పదేళ్లు మింగేసింది. నేను ఇంకా బతికి ఉన్నానంటే ఆమె ప్రవర్తనని నీ ప్రేమ బాలన్స్ చేస్తున్నది కాబట్టే. నీ చాట్ లేకపోతే నేను నడిచే శవాన్ని. నాకు బతుకు మీద ఇచ్ఛ నశించింది.

చివరికి భారతి కరుణించి ఒక పెద్ద వాయిస్ మెసేజ్ పెట్టింది. ’ నేను నిన్ను ఎంతగానో ప్రేమించాను. నా భర్త పోయిన దగ్గర్నుండీ మనమెంతో దగ్గరయ్యాము – మానసికంగా. నేను దుఃఖంతో డిప్రెషన్ లోకి వెళ్లకుండా నువ్వు నన్ను కాపాడుకున్నావు. నీ మెసేజ్ చూడగానే నేను షాక్ అయ్యాను. ఫ్రీజ్ అయిపోయాను. ఏడ్చేసాను అంటూనే పాత మెసేజ్ లను తిరగతోడింది. నేను సెల్ఫీలు పెడితే నువ్వు బ్యూటిఫుల్, ఎలిగంట్, అట్రాక్టివ్, చార్మింగ్, గ్రేస్ ఫుల్ అని సమాధానం రాసేవాడివి. నేను నిన్ను నిరుత్సాహ పరచాలని నేను ముసలిదాన్ని అయిపోయాను.ఎదురుగా చూస్తే అలా అనవు అని రిప్లై ఇచ్చేదాన్ని. అయినా నువ్వు పదే పదే ఆ మాటలే అనేవాడివి. సరే, పోనీలే అని వదిలేశాను. అసలు అన్ని సెల్ఫీలు ఎందుకు పంపానంటే నువ్వు తరచూ జబ్బు పడేవాడివి.నిరుత్సాహంగా ఉండేవాడివి. నా ఫోటోలు ఇష్టపడతావు కదా, నీ

మూడ్ ని మార్చాలని పంపేదాన్ని. నువ్వు సినీనటుల బెడ్ రూమ్ విషయాలు తరచూ చెప్పినా ఇటువంటి విషయాలు మన మధ్య వద్దు అని చెప్పేదాన్ని. ప్రతిసారీ నువ్వు సరే, సరే అంటూనే తరచూ అవే మాట్లాడేవాడివి. సరే వదిలేశాను. నీ భార్య ప్రైవేట్ పార్ట్స్ గురించి మాట్లాడినప్పుడు కూడా చాలా బాధ పడ్డాను. ఏడ్చేసాను. ఎందుకిటువంటి మెసేజ్ నాకు పెట్టాడు అని అనుకున్నాను అని షాక్ అయ్యాను. కానీ వదిలేశాను.  ఒక మెసేజ్ లో నీ సెల్ఫీలు చాలా డీసెంట్ గా తీసుకుంటావు క్లీవెజ్ కనపడకుండా అని పెట్టావు. ఏంటిది ఇతను నా క్లీవెజ్ గురించి మాట్లాడుతున్నాడు అని షాక్ అయ్యాను. కానీ వదిలేశాను.అలాగే నువ్వు ఎందుకు దుపట్టా వేసుకోవు అని రాస్తే ఇదో పెద్దవిషయమా అనుకున్నాను. షాక్ అయ్యాను. వదిలేశాను. నాకు కొంచెం భయంగా ఉంది నేను హద్దు మీరుతున్నానేమో అంటూనే జాకెట్టు వెనక గుండీలు ఎలా పెట్టుకుంటారు? అని అడిగావు. ఏదో కుతూహలంలే అని సరిపెట్టుకున్నాను. అలా ఆమె మెసేజ్ అంతా చాలాసార్లు షాక్ అయ్యింది.చాలాసార్లు హర్ట్ అయ్యింది. చాలాసార్లు ఏడిచేసింది. చివరికి నేను ఎంత అమాయకంగా ఉన్నాను అని ఆశ్చర్యపోతూ ఆ వాయిస్ మెసేజ్ ముగించింది.

ఈ ఆఖరి మాటతో కృష్ణకి తిక్కరేగింది. మగవాళ్ళు తిట్టే అన్ని బూతులు తిట్టుకున్నాడు ఆమెని. కానీ ఆమె స్నేహాన్ని  వదులుకునే స్థితిలో అతను లేడు. అందువల్ల నువ్వు అమాయకురాలిని అన్న మాట నాకు బాధ కలిగించింది అని రాశాడు.  దానికి భారతి ఇంకో పెద్ద వాయిస్ మెయిల్ పంపింది. అఫ్ కోర్స్ నేను అమాయకురాలినే. నువ్వు నీ భార్య శరీరం గురించి, నీ సెక్స్ సామర్ధ్యం గురించి మాట్లాడుతుంటే ఒక మగాడి మనసులో ఏముంది అని గ్రహించకుండా నీతో స్నేహం కొన సాగిస్తున్నానంటే నేను అమాయకురాలినే కదా! నేను ఎప్పుడూ అటువంటి విషయాలు మాట్లాడలేదు. ఇదివరలో ఒకసారి నీ మీద నాకు కామముందా?  నా మీద నీకు కామముందా?  అని రాశావు. ఎందుకు ఉంటుంది? నేను నీ భార్యనా? కనీసం ప్రేమికురాలినా? ఇంకొకసారి మనం ఒంటరిగా ఎప్పుడు కలిసాము? కలిస్తేనే కదా ఫిజికల్ రిలేషన్ షిప్ కి ఆస్కారం ఉంటుందని రాశావు.  అంటే ఏంటి? ఒంటరిగా సెక్స్ కోసమే కలుస్తారా?  సంతోషంగా ఉండటానికి, మాట్లాడుకోవటానికి కలవకూడదా?

కృష్ణకి ఆమెసేజ్ లతో  చాలా కోపం వచ్చింది. రెండు సంవత్సరాలనుండి తనను కవ్వించి, తనతో ఇంతదూరం ప్రయాణించి ఇప్పుడు నీతి వాక్యాలు వల్లిస్తోంది అని మండి పోయింది. వెంటనే ఒక మెసేజ్ రాశాడు.  ‘ ముందు సారీ చెప్పనీ. నేను లక్ష్మణరేఖ దాటినట్టున్నాను. అసలు విషయం ఏమిటంటే నేను నిన్నెప్పుడూ స్త్రీవి అనుకోలేదు. అత్యంతసన్నిహితమైన ఫ్రెండ్ వి అనుకున్నాను. నీ చాట్ లు నన్ను చాలా బాధ పెట్టాయి. నువ్వంటే నాకు పిచ్చి. ఇంతకంటే నేను సంజాయిషీఇవ్వలేను. ఇక ఈ స్నేహం ఆపేద్దాం. నా గురించి ఇక భయపడకు. ఇక నా చాట్ లు నీకు రావు. ఏతావాతాచెప్పేదేమంటే గుడ్ బై!

అప్పుడే కేశవ యూరోప్ ట్రిప్ ప్లాన్ చేశాడు. కృష్ణ భారతిని బ్లాక్ చేసి మధుతో, కేశవ కుటుంబంతో యూరోప్ వెళ్ళిపోయాడు. మత్తు మందులా ఇన్నాళ్లూ సాగిన ఆన్లైన్ వ్యామోహానికి తాత్కాలికంగా తెరపడింది. అక్కడ ఎన్నివిశేషాలు చూసినా అతని మనసు భారతి నుండి డైవర్ట్ కాలేదు. ఎదురుగా భార్య ఉంది. ఎదిగిన కొడుకు, కోడలు ఉన్నారు, ముత్యాల్లాంటి మనమలు, తన వయసు ఏదీ అతని వ్యామోహన్ని ఆపలేకపోయాయి. అతను భారతి కాంటాక్ట్ ని అన్ బ్లాక్ చేసేసాడు. అప్పటివరకూ భారతి అతనితో ఆడుకుంది. అతను బ్లాక్ చేయగానే ఆమెకి వెర్రెక్కి పోయింది. ఇప్పుడు ఆమె కూడా ఆ పొగడ్తలకి, ఆ చాట్ లకి ఎడిక్ట్ అయిపొయింది. అతను అన్ బ్లాక్ చేయగానే భారతి రంగం లోకి వచ్చేసింది. ‘చాలా సంవత్సరాలనుండి మనం స్నేహితులం. ఆయన పోయాక నువ్వు మనసుకి చాలా దగ్గరయ్యావు. ప్రతిరోజూ నన్ను ఓదార్చి డిప్రెషన్ లోకి వెళ్లకుండా కాపాడుకున్నావు. ఇన్నేళ్ల స్నేహం గుడ్ బై అనే ఒక్క మాటతో కట్ చేస్తావా? నాకు తెలియకుండానే నేను నీకు కనెక్ట్ అయిపోయాను. ఎందుకో తెలియదు నిన్ను చాలా ప్రేమించాను. అపార్థంమన మధ్య సహజం. వాటిని మనం క్లియర్ చేసుకోవాలి. అంతే కానీ స్నేహాన్ని కట్ చేసుకోకూడదు. ‘

కృష్ణకి ఇది చాలు. అయితే వేరే దేశంలో ఉండటం వల్ల ’నీతో మనసు విప్పి చాలా మాట్లాడాలి. ఇండియా తిరిగి వచ్చాక మాట్లాడతాను అని చాట్ ద్వారా సమాధానం ఇచ్చాడు. భారతి ఇండియాలో దిగగానే అతను పరుగు పరుగున చెన్నై వస్తాడని ఆశించింది. కృష్ణకి ఆమెతో మాట్లాడితే వచ్చే కిక్ చాలు. చెన్నై వెళ్లాలనే ఆలోచనే లేదు. అయినప్పటికీ నన్ను ఎప్పుడూ ఏ స్త్రీ ఇలా ఆహ్వానించలేదు. నువ్వు పిలిచావు. ఇటువంటి అవకాశాన్ని ఎలా పోగొట్టుకుంటాను. నీ ఆహ్వానాన్ని రిజర్వులో వుంచు అని తిరిగి చాట్ చేశాడు.

‘నువ్వు నన్ను నిరాశ పరిచావు. నువ్వు వస్తావని, మనిద్దరం కలిసి నడవాలని, మాట్లాడుకోవాలని, నీతో సమయం గడపాలని అనుకున్న నా ఆశల మీద నీళ్లు పోసావు. మన ఇన్నాళ్ల బంధం తర్వాత నువ్వు నన్ను ఇంత నిరాశ పరుస్తావని అనుకోలేదు. వదిలేయ్. నిన్నిక డిస్టర్బ్ చేయనులే. ‘ అని రాసింది.

మళ్ళీ కృష్ణ దాసోహం అన్నాడు. మామూలుగానే మధు ఆసరా తీసుకున్నాడు. ’ డార్లింగ్! నీకు తెలీదా నీ సాంగత్యంకోసం నేను ఎంత పరితపిస్తున్నానో. నీకు ఇదివరకే చెప్పాను. నా భార్యకి చాలా అనుమానం. మన రాష్ట్రం అంటే ఏదో వంకతో రాగలను. చెన్నై ఏ వంకతో రాను? అయినప్పటికీ ప్రతిక్షణం ఆ ప్రయత్నంలోనే ఉన్నాను. నీకు చెప్పాను గుడ్ బై అనటం తప్పే. నీ సాన్నిహిత్యం కావాలి నాకు. అలగకు. నేను యూరోప్ వెళ్ళక ముందు నుండీ మన బంధం కొంచెం స్ట్రైన్ అయింది. నేనే ఏదో తప్పు చేసి ఉంటాను. నా మాటలో, మెసేజ్ లో నిన్ను నొప్పించి ఉంటాయి. అయినా నువ్వు నన్ను పర్సనల్ గా కలవమని పదే పదే అడుగుతున్నావు. నేను ప్రస్తుతానికి హైదరాబాద్ వదిలి రాలేను. మీ అక్క మల్కాజ్గిరి లో ఉంటుందని నువ్వు ఎప్పుడో చెప్పిన గుర్తు. అక్కడికి రాగలవా? నేను అక్కడికి వచ్చి నిన్ను కలుస్తాను. సరేనా? అసలు నీ పద్ధతి నాకు చాలా అయోమయంగా ఉంది.సరేలే .మనం కలిసినప్పుడు మాట్లాడుకుందాం. “

భారతి 'మా అక్క ఇంట్లో కాదు. మనిద్దరమే. వేరే ఎక్కడయినా?' అని రాసింది. కృష్ణకి గొంతులో పచ్చి వెలక్కాయ పడింది. ఈ హైదరాబాద్ లో ప్రతి గల్లీలో తనకి తెలిసిన వాళ్ళు ఉండే అవకాశం ఉంది. తన క్లినిక్ కాక నగరంలోని చాలా ఆసుపత్రులకు అతను కన్సల్టింగ్ సర్జన్.కార్పొరేట్ కళాశాలలు మొదటి ర్యాంక్ విద్యార్థిని అందరూ  ఇతను మా కళాశాల విద్యార్థి అని చెప్పుకున్నట్టు నగరంలోని చాలా ఆసుపత్రులు  ఊరంతా అతని ఫోటోలతో ఫ్లెక్సీలుకట్టేసారు. ఆమె అక్క ఇల్లయితే ఎవరో పేషెంట్ ని చూడటానికి వెళ్లాడనుకుంటారు. భారతి ఎంత కోపంగా రాసిందంటే 'మనమిద్దరమే అంటే అర్థం కాదా నీకు? నువ్వు ఒంటరిగా నన్ను కలవలేకపోతే వదిలేయ్' అంటూ ఒక ఎర్రటి కోపం మెసేజ్ పెట్టింది.

తర్వాత మెసేజ్ కృష్ణదే. అతను తోటివారి పట్ల, తన నర్సులపట్ల ఎంత మర్యాదగా ఉంటాడో వాళ్ళు కొంచెం గొంతు పెంచితే అంత ఇర్రిటేట్ అవుతాడు.  ఇంట్లో కూడా అంతే. తనకి వ్యతిరేకంగా మాట్లాడితే నరసింహావతారమే! అటువంటిది ఈమె కోపగించుకుంటే 'దయచేసి కోపగించుకోకు. నువ్వు చెప్పింది అర్థం అయ్యింది. తప్పకుండా మన ఇద్దరమూ మాత్రమే ఉండేలా ఏర్పాటు చేస్తాను. ఇంతలోనే అలగకు. సారీ!'అని రాశాడు.

అబ్బ! ఏం కంట్రోల్ చేసింది? ఇతని వ్యామోహమో, ఆమె జాణతనమో తెలీదు గానీ ఆమెకి కోపం వచ్చిందంటే ఎదురుగా లేదుకానీ, కాళ్ళ మీద పడేంత దీనత్వం ఆ మెసేజ్ లలో. ' నీ మీద అలగటానికి నేనెవర్ని అని ఆమె రాస్తే ' ఏమంటున్నావ్ నువ్వు? నీకు తెలీదా నువ్వు నాఫామిలీ ' అని సమాధానం.  ఒక మెస్సేజ్ లో 'నువ్వు ఇవాళ డీపీ లో పెట్టిన ఫోటో లేదు నా దగ్గర. నువ్వు పంపనన్నావు కదా!  నన్ను శిక్షించటానికి నువ్వు ఎన్నుకున్న మార్గం ఇదీ! నా దురదృష్టం.'!'

***(కొనసాగింపు వచ్చే నెలలో)***

COMMENTS